# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో పింఛన్ల కోసం మొత్తం ఐదేళ్లకు కలిపి లక్షా 65 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ ను 2030 నాటికి ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.
- ❖ రానున్న పండుగ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాలలో కూడా భక్తుల రద్దీ పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు.
- ❖ తీవ్ర వాయుగుండంగా మారిన దిత్వా తుఫాను రాగల 10 గంటల్లో మరింత బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం గోపీనాథపట్నంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈరోజు పాల్గొన్నారు. అర్హులకు పింఛన్ల పంపిణీ తరువాత ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... ఏడాదికి 33 వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో మొత్తం లక్షా 65 వేల కోట్ల రూపాయలను పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. కొల్లేరు సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. 2027 నాటికి గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఆక్వా కల్చర్ అభివృద్ధికి ప్రభుత్వం 850 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

రాష్ట్రాన్ని 2030 నాటికి ఎయిడ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడలోని స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల గతంలో ఉన్న 2.34 శాతం పాజిటివిటీ రేటు గత 10 సంవత్సరాల్లో 0.58 శాతానికి తగ్గిందన్నారు. 35 వేల నుంచి 40 వేల రూపాయలు ఖరీదు చేసే యాంటీ రెట్రో వైరల్ థెరపీ మందులని ఉచితంగా 59 ఏఆర్టీ సెంటర్ల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పీహెచ్సీలలో ఏఆర్టీ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పాజిటివిటీ నిర్ధారణకు కన్ఫర్మేటరీ సెంటర్లకు వెళ్లేందుకు సంకోశించే వారి కోసం 15 మొబైల్ ఐసిటిసిలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో అవగాహన కలిగించడం కారణంగా హెచ్ఐవి పాజిటివిటీ రేటు 0.10 శాతం నుండి 0.04 శాతానికి తగ్గిందని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

====================

రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాలలో భక్తుల రద్దీ పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో ఆ సంస్థ కార్యకలాపాలపై ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రోబోయే రోజుల్లో వరుసగా పండగలు, ప్రత్యేక పర్వదినాలు వస్తున్న నేపథ్యంలో అన్ని ఆలయాల్లోనూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. జిల్లా అధికారులు తమ తమ పరిధిలో ఉన్న ప్రైవేటు ఆలయాల పర్యవేక్షణపైన కూడా దృష్టి సారించాలన్నారు. అలాగే రబీ సీజన్‌కు ఎరువుల కొరత ఉండకుండా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని విజయానంద్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

విరామం

====================

దేశంలో సినిమాల చిత్రీకరణకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను నిలుపుతామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. ఈ దిశగా రాష్ట్రంలో సమగ్రమైన నూతన `ఫిల్మ్ టూరిజం పాలసీ`ని ఆవిష్కరిస్తామన్నారు. ముంబయిలో జరుగుతున్న `సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025`లో మంత్రి ఈరోజు పాల్గొని ఫిల్మ్, టూరిజం రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై కీలకోపన్యాసం చేశారు. భారతీయ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ (M&E) రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ముఖ్య ప్రయోజనాలను ఈ సందర్భంగా మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక, ఆతిథ్య రంగాలకు `పరిశ్రమ హోదా` కల్పించడం వల్ల అన్ని రకాల రాయితీలకు త్వరితగతిన అర్హత లభిస్తుందని స్పష్టం చేస్తూ పెట్టుబడుదారులను రాష్ట్రానికి ఆహ్వానించారు.

====================

తుఫాన్ల సమయంలో విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ ల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ తో కలిసి ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... దిత్వా తుఫాను కారణంగా రాష్ట్రంలో కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశామని... ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ఎటువంటి విపత్తు వచ్చినా ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొంటుందని హోం మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

=====================

నైరుతి బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల సమీపంలోని నిన్నటి దిత్వా తుఫాను బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది గడచిన 6 గంటల్లో 5 కిలో మీటర్ల వేగంతో ఉత్తర వాయువ్య దిశగా కదులుతోందని వెల్లడించింది. ప్రస్తుతం ఇది చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలోనూ.. నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా 200 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. రాగల 10 గంటల్లో వాయుగుండంగా మరింత బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎస్. కరుణాసాగర్ తెలియజేశారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్రలో కొన్ని చోట్ల రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీన 'మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్' జరగనుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో కూడా విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పై ఈరోజు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.

=====================
=====================